క్లుప్తంగా

ఏపీపీకి సన్మానం



ఏపీపీ నరేష్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా పని చేసిన నరేష్‌కు బదిలీ కావడంతో గజపతినగరం బార్ అసోసియేషన్ సోమవారం రాత్రి ఆయన్ని ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బిట్ర సూర్యారావు, సీనియర్ న్యాయవాదులు యు.రమేష్‌రాజు, రమణాజీ, గండి విద్యాసాగర్, కె.రామానాయుడు, ఆర్.శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస సబ్ రిజిస్ట్రార్‌గా చిన్నమ్మలు



చిన్నమ్మలు

కొత్తవలస: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ రిజిస్ట్రార్‌గా చిన్నమ్మలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ రిజిస్ట్రార్‌గా పనిచేసిన తారకేశ్వరరావుకి గాజువాక బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో గజపతినగరం నుంచి చిన్నమ్మలు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈమె గతంలో ఇక్కడ జూనియర్ సహాయకురాలిగా పనిచేశారు. కార్యాలయ సిబ్బంది,పలువురు డాక్యుమెంట్ రైటర్లు ఆమెకు స్వాగతం పలికారు.

పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

చీపురుపల్లి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పట్టణంలోని శ్రీనివాసా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరిశుభ్రతపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించడంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారానికి 2 గంటలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పీఓలు గవిడి సుబ్రహ్మణ్యం, మీసాల వెంకటరమణ, పీడీ కె.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ టీడీసీ మెంబర్‌గా సుబ్బలక్ష్మి



సుబ్బలక్ష్మి

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల జాబితాలో ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందుకూరి సుబ్బలక్ష్మికి చోటు దక్కించుకున్నారు. ప్రభుత్వం ఆమెను ఆంధ్రప్రదేశ్ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్(టీడీసీ) మెంబర్‌గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అర్హులందరికీ పథకాలు అందించాం



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు, మండల పరిషత్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మండలంలో అర్హులందరికీ పథకాలు అందేలా చూశానని చల్లా చలంనాయు డు చెప్పారు. ఎంపీపీగా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చలంనాయుడు కేక్ కట్ చేశారు. జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాష్, వైస్ ఎంపీపీ జి.ఈశ్వరరావు, నాయకులు అప్పలనాయుడు, రమణ, బి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఏఓ వెంకటరమణ పాల్గొన్నారు.

లే అవుట్‌పై హైకోర్టు స్టే



లేఅవుట్‌లో ఫ్లెక్సీ కట్టిన వీఆర్‌ఓలు

శృంగవరపుకోట: పట్టణంలోని గాయత్రీదేవి ఆలయం వెనుక ఉన్న లేఅవుట్‌లో ఎటువంటి క్రయవిక్రయాలు లేకుండా చూడాలని, యథాతథ స్థితి కొనసాగించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సర్వే నంబర్ 505–4 ఏ, 4బీ, 4సీలలో ఉన్న 7.25 ఎకరాల్లో చెరువును కబ్జా చేసి లేఅవుట్ వేశారని పట్టణానికి చెందిన హెచ్.సన్యాసిశెట్టి హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులను అనుసరించి తహసీల్దార్ ఆదేశాల మేరకు మంగళవారం వీఆర్‌ఓలు రమణ, కన్నయ్య సదరు లేఅవుట్‌లో కోర్టు ఉత్తర్వులను తెలియపరుస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

ఉపాధిహామీలో అక్రమ వసూళ్లు..!

- ఒక్కో వేతనదారుడు నుంచి రూ.100 చొప్పన వసూలు
- 36 పంచాయతీల్లోను వసూలు చేసినట్టు ఆరోపణలు
- రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వసూలు
- నరవలో ఇటీవల నిర్వహించిన విచారణలో విషయం బట్ట బయలు



గంట్యాడ మండలంలో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

గంట్యాడ:

- నరవ పంచాయతీకి చెందిన సుమారు 250 నుంచి 300 మంది ఉపాధిహామీ వేతనదారులు దగ్గర ఉంచి రూ.20 వేలు నుంచి రూ.30 వేలు వరకు ఉపాధిహామీ సిబ్బంది వసూలు చేశారు. ఆ మొత్తాన్ని డ్వామాలో పనిచేస్తున్న ఓ అధికారికి ఇచ్చినట్టు ఇటీవల జరిపిన విచారణలో బయట పడినట్టు సమాచారం.
- లక్కిడాం పంచాయతీలో 600 మంది వేతనదారుల దగ్గర నుంచి ఉపాధిహామీ సిబ్బంది రూ.60 వేలు వరకు వసూలు చేసి సదరు అధికారికి ఇచ్చినట్టు తెలిసింది.
- పెనసాం గ్రామంలో 400 మంది వేతనదారుల నుంచి ఉపాధి సిబ్బంది రూ. 40 వేలు వరకు వసూలు చేసి అదే అధికారికి ఇచ్చినట్టు సమాచారం.
- మధుపాడ గ్రామంలో కూడా 300 నుంచి 400 మంది వేతనదారులు దగ్గర రూ.40 వేలు వరకు వసూలు చేసి సదరు అధికారికి ఉపాధి సిబ్బంది ముట్టజెప్పినట్టు తెలిసింది.

ఈ నాలుగు పంచాయతీలే కాదు గంట్యాడ మండలంలోని దాదాపు అన్ని పంచాయతీల్లోనూ వేతనదారుల దగ్గర నుంచి ఉపాధిహామీ సిబ్బంది డబ్బులు వసూలు చేసినట్టు భోగట్టా. ఒక్కో వేతనదారుడి నుంచి రూ.100 చొప్పన వేతనదారులు అందరి దగ్గర నుంచి వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేతనదారుల నుంచి వసూలు చేసిన లక్షలాది రూపాయలు ఉపాధిహామీ సిబ్బంది డ్వామాలో పనిచేస్తున్న ఓ అధికారికి ముట్టజెప్పినట్టు సమాచారం. ఇటీవల నిర్వహించిన ఓ విచారణలో డబ్బులు వసూలు చేసిన ఘటన బయట పడింది.

18 వేల మంది వరకు వేతనదారులు

గంట్యాడ మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 18 వేల మంది వరకు వేతనదారులు ఉన్నారు. వీరింతా ఆయా పంచాయతీల్లో జరిగే ఉపాధిహామీ పనులకు వెళ్తారు. వీరి దగ్గర నుంచి క్షేత్రస్థాయిలోని ఉపాధిహామీ సిబ్బంది వసూలుచేసిన సుమారు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు డ్వామాలో పనిచేసే ఉన్నతాధికారికి అందజేసినట్టు సమాచారం. విషయం కొందరు అధికారులకు తెలిసినా పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నరవలో జరిగిన విచారణలో వెల్లడి..

నరవ పంచాయతీలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరుపై కొద్దిరోజుల కిందట డ్వామా అధికారులు విచారణ జరిపారు. ఈ విచారణలో వేతనదారులు రూ.100 చొప్పున ఉపాధిహామీ సిబ్బందికి ఇచ్చినట్టు విచారణ అధికారికి తెలిపారు. ఇదే విషయాన్ని విచారణ అధికారి డ్వామా అధికారులకు నివేదిక అందజేశారు.

చర్యలు తీసుకుంటాం..

వేతనదారుల వద్ద రూ.100 చొప్పన వసూలు చేసిన విషయం తన దృష్టికి వచ్చింది. మరింత లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.
– బి.అరుణశ్రీ, పీడీ, డ్వామా

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



చీపురుపల్లి: వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష

చీపురుపల్లి: చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చదరంగం, అథ్లెటిక్స్ తదితర విభాగాల్లో అండర్–14, 17 మండలస్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గవిడి సురేష్, టీడీపీ నాయ కులు కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు, దన్నాన రామచంద్రుడు, రౌతు కామునాయుడు, రమణ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



శృంగవరపుకోట: మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం లో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణం నడి బొడ్డున ఉన్న విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతానంటూ హామీ ఇచ్చారు. క్రీడలను ప్రోత్సహించాలని, ఎస్.కోట క్రీడాకారుల ఖిల్లాగా మారాలని, అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు మండల స్పోర్ట్స్ కో– ఆర్డినేటర్, ధర్మవరం హైస్కూల్ పీఈటీ శ్రీరాములు మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారంతా నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఐ.సుబ్బలక్ష్మి, సర్పంచ్ సంతోషికుమారి, మండల నోడల్ అధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ అరుణకుమారి, ఎంఈఓ నర్సింగరావు, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

గుర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను బుధవారం, గురువారం రెండు రోజుల పాటు నిర్వహించనున్న ట్లు ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్ –14, 17 విభాగాల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. మండల స్థాయి పోటీల్లో రాణించిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, విద్యార్థులంతా పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని హైస్కూల్‌లో పనిచేస్తున్న పీఈటీలు కళాశాల మైదానంలో పోటీలకు సంబంధించిన ఏర్పాట్లు పరి శీలించారు.



గుర్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేస్తున్న పీఈటీలు

గంట్యాడలో పోటీలు రేపు

గంట్యాడ: మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఈనెల 26వ తేదీన పెదవేమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు హెచ్ఎం ఆదిలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, షటిల్ బాడ్మింటన్, చెస్, వాలీబాల్ క్రీడలతో పాటు యోగాలో పోటీలు ఉంటాయని, మండల పాఠశాలల విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

సురక్షిత తాగునీటితో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్

గంట్యాడ: సురక్షిత నీటిని తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు రావని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలం లోని పెంటశ్రీరాంపురం గ్రామంలో తాగునీటి వనరులు, పరిసరాల పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ట్యాంకులను ప్రతి పదిహేను రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని, ట్యాంకుల వద్ద ఉన్న పట్టిక ప్రకారం క్లోరినేషన్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రజారోగ్యశాఖ ఈఈ కె.దక్షిణామూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ వ్యక్తికి రోజుకు 55 లీటర్ల రక్షిత నీటిని, పట్టణ ప్రాంతాల ప్రజలకు 135 లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నామని, నీటిని పొదుపుగా వాడుకోవాలని చెప్పారు. అలాగే పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు. ఈఈ ఎస్.కవిత, డీఈఈ యడ్ల గోవిందరావు, సర్పంచ్ కరక గౌతమి, ఏఈ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ మెంబర్‌గా 'గద్దే'



గద్దే బాబూరావు

చీపురుపల్లి: రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ మెంబర్‌గా మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావును ప్రభుత్వం నియమించింది. మంగళవారం ప్రభుత్వం పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. అందులో భాగంగానే పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్‌కు మెంబర్‌గా గద్దే బాబూరావును నియమించింది. ఈయన 1984లో ఎమ్మెల్సీగా, 1987లో మినిమం వేజ్ బోర్డ్ చైర్మన్‌గా, 1989లో అర్బన్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్‌గా, 1991లో ఆర్ఈసీఎస్ చైర్మన్ పదవులు చేపట్టారు.1994, 1999లో చీపురుపల్లి ఎమ్మెల్యేగా పని చేశారు.

సామూహిక సీమంతం



సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు

శృంగవరపుకోట: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని బొడ్డవర రామాలయంలో ఎస్.కోట ఐసీడీఎస్ పీఓ ఉమ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన చేశారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ముఖ్య అతిథిగా హాజరై గర్భిణులకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, రవికెలు, గాజులు అందించి ఆశీర్వదించారు. ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, తహసీల్దార్ అరుణకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పి.సుశీల, ఎస్.నాగరత్నం, బొడ్డవర పంచాయతీ పరిధి అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

గజపతినగరం: రైతులు,కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రైతులతో కలిసి మంగళవారం ధర్నా చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సహాయంగా ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని మండిపడ్డారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడునెలలు గడుస్తున్నా పెట్టుబడి సహాయం అందించలేదన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వక పోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతీ రైతుకు రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేయాలని, పంటల బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగించవద్దని కోరారు. అనంతరం తహసీల్దార్ రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

అధికార పార్టీ నాయకుల అతి..



పొలం పిలుస్తోంది వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు భాస్కరావు, సాయికృష్ణ

గంట్యాడ: ప్రభుత్వ కార్యక్రమాలను టీడీపీ నాయకులు తమ పార్టీ కార్యక్రమాలుగా మార్చేస్తున్నారు. వారు ప్రజాప్రతినిధులు కాకపోయినప్పటికీ ప్రభుత్వ సభలు, సమావేశాలు, కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు పార్టీ కండువాలు, జెండాలతో రాకూడదు. కానీ టీడీపీ నేతలు పసుపు షర్టులు, పసుపు కండువాలు ధరించి హాజరువుతున్నారు. అధికార పార్టీ నేతల మెప్పు పొందేందుకు ప్రజాప్రతినిధులు కాకపోయినప్పటికీ టీడీపీ నాయకులను అధికారులు ప్రభుత్వ కార్యక్ర మాలకు ఆహ్వానిస్తున్నారు. మంగళవారం నరవ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభకు టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కరావు, నరవ గ్రామ టీడీపీ కార్యకర్త సుంకరి సాయికృష్ణ పసుపు షర్టు, పసుపు కండువాలతో హాజరయ్యారు. వారితోనే పొలం పిలుస్తోంది వాల్‌పోస్టర్లను ఏఓ శ్యామ్ కుమార్, పశు వైద్యాధికారులు దగ్గరుండి ఆవిష్కరించేలా చేయడం గమనార్హం. ప్రభుత్వ కార్యక్రమానికి ఇలా పార్టీ కండువాలతో రావడం ఏంటని రైతులు గుసగుసలాడుకున్నారు.

ఎస్.వి.రమణరాజు పుట్టినరోజు వేడుకలు



రమణరాజుతో కేకును కట్ చేయిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్.వి.రమణరాజు పుట్టిన రోజు వేడుకలను ఆయన స్వగ్రామం సోమలింగాపురంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై రమణరాజుతో కేక్ కట్ చేయించారు.మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, గుర్ల మండల నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, మండలంలోని పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు చెకుముకి సైన్స్ పరీక్ష

గంట్యాడ: రాష్ట్ర వ్యాప్త చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా స్థానిక విద్యావనరుల కేంద్రంలో బుధవారం చెకుముకి సైన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్.తిరుపతినాయుడు తెలిపారు. సంబంధిత వాల్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి 8,9,10 తరగతులకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో అక్టోబర్ 27న, రాష్ట్ర స్థాయిలో నవంబర్ 9,10 తేదీల్లో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.యూటీఎఫ్ గంట్యాడ మండల అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు బి.శ్యామ్‌కుమార్, జి. మురళీమోహన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రమణ, గౌరవ అధ్యక్షుడు బి.వెంకటరావు, కోశాధికారి బి.శాంతేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో నాయకత్వ లక్షణాలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): ఎన్ఎస్ఎస్ దే వేడుకల్లో మాట్లాడుతున్న ఎస్ఐ లోకేశ్వరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో చేరడం ద్వారా నాయకత్వ లక్షణాలు అలవడతాయని గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వరరావు అన్నారు. గరివిడి వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో అసోషియేట్ డీన్ డాక్టర్ మక్కేన శ్రీను ఆధ్వర్యంలో జాతీయసేవా పథకం దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఎన్ఎస్ ఎస్‌లో చేరి సమాజ సేవ చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు బ్యాడ్జీలను అందజేశారు. అంతకుముందు చీపురుపల్లి,గరివిడి కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన,వక్తృత్వం తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్.వి.కె.దుర్గాప్రసాద్, అధ్యాపకులు ఎన్.ఝాన్సీరాణి, సుధారాణి, ఎన్ఎస్ఎస్ అధికారులు షేక్‌మస్తాన్‌బి, జి.ఎస్.హరిత, ఎస్.గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేవకు మార్గం



గజపతినగరం: మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ

గజపతినగరం: ప్రజలకు సేవ చేయాలంటే ఎన్ఎస్ఎస్ ఒక మార్గమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవాపథకం దినోత్సవం నిర్వహించారు. కళాశాల కో–ఆర్డినేటర్ మాదవరావు,అధ్యాపకులు విజయదుర్గ, శాంతిప్రియ, శ్రీనివాస్‌భాను, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించేందుకు 28వరకు గడువు

మెరకముడిదాం: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు రాద్దమనుకునే వారు ఈనెల 28వ తేదీలోగా ఫీజు చెల్లించా లని మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాల హెచ్ఎం కోట్ల ఎల్లంనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

మొక్కల పంపిణీ

వేపాడ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సూచించారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో బొద్దాం గ్రామంలో సేవ్ ట్రీస్ సంస్థ సహకారంతో వివిధ గ్రామాల వారికి మంగళవారం మామిడి,జామి, జీడి, కొబ్బరి తదితర మొక్కలు పంపిణీ చేశారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం కో–ఆర్డినేటర్ వెంకటరావు, నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ కూర్మనాథపట్నాయక్, సర్పంచ్ ఎర్రా సత్యవతి, ఎంపీటీసీ పిల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామం వోలమ్ కంపెనీ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు... విజయనగరానికి చెందిన వి.రేవంత్‌కుమార్ అనే వ్యక్తితో పాటు మరో ఏడుగురు వ్యక్తులు బొబ్బిలిలో రియల్ ఎస్టేట్ వ్యాపార పనులు ముగించుకుని మినీవ్యాన్‌లో తిరిగి విజయనగరం వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని మరుపల్లి వోలమ్ కంపెనీ వద్దకు వచ్చేసరికి ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, అయిదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. రేవంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యం



లక్కవరపుకోట: తలారిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



వేపాడ: దిబ్బపాలెంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి



మెరకముడిదాం: గరుగుబిల్లిలో పొలం పిలుస్తోంది వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు



గంట్యాడ: రామవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్యామ్‌కుమార్



జామి: అప్పన్నపాలెంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



గుర్ల: తాటిపూడిలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ తిరుపతిరావు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా రైతులకు సాగులో మెలకువలు, సూచనలు, సలహాలు అందించేందుకు ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తోందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. శృంగవరపుకోట, చీపురుపల్లి,గజపతినగరం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో అధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతులకు పంటల యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణకు మందుల పిచికారీ, ప్రకృతివ్యవసాయంలో భాగంగా కషాయాల తయారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.క్షేత్రస్థాయిలో పంట లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశా రు. మెరకముడిదాం మండలంలోని గరుగుబిల్లి గ్రామంలో చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, వేపాడ మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొని పొలం పిలుస్తోంది వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం 'పొలంపిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, పంటల సాగులో వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించాలని రైతులకు సూచించారు. ఏఓలు, సచివాలయ ఉద్యోగులు, పశువైద్యాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. - లక్కవరపుకోట/ కొత్తవలస/) వేపాడ/మెరకముడిదాం/ గంట్యాడ/గుర్ల/జామి/దత్తిరాజేరు/గజపతినగరం



కొత్తవలస: చీడివలసలో కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



దత్తిరాజేరు: దత్తిరాజేరులో రైతులకు కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ గోవిందమ్మ



గజపతినగరం: కాలంరాజుపేటలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు